ప్రజాశక్తి

సోమవారం 4 మార్చి, 2024

5

శ్రీకాకుళం



'తెరవే' సాహితీ సమ్మేళనం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని స్థానిక శాంతినికేతన్ కళాశాలలో తెలుగు రచయితల వేదిక ఆధ్వర్యాన ఆదివారం నెలవారీ సాహితీ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. తెరవే అధ్యక్షులు ఉత్తరావల్లి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ కోమలరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కవితపై ఆసక్తి పొంపొందించడం ద్వారా తెలుగు సాహిత్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో కవులు గుడిమెట్ల గోపాలకృష్ణ, పి.వి.దుర్గాప్రసాద్, డాక్టర్ నిక్కు అప్పన్న, నాగేశ్వరరావు, ఐ.యన్.డి.ప్రసాద్, ఇద్ది పాపయ్య బి.జగన్నాథం తమ కవితలను చదివి వినిపించారు.



తెరవే సమ్మేళనంలో పాల్గొన్న కవులు

ఒడిశా టూ చెన్నై

వయా పలాస

- యథేచ్ఛగా గంజాయి అక్రమ రవాణా
- ఒడిశా నుంచి రాక
- ఒకే నెలలో 200 కేజీల గంజాయి లభ్యం
- ఎక్కువగా యువత బలి



పలాస జిఆర్‌పి స్టేషన్‌లో స్వాధీనం చేసుకున్న గంజాయి బ్యాగులు

ఒడిశా ప్రాంతంలో సాగవుతున్న గంజాయి ఒడిశా టూ చెన్నయ్... వయా పలాస కేంద్రంగా గంజాయి అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. ప్రధానంగా పలాస రైల్వే స్టేషన్ కేంద్ర బిందువుగా ప్రయాణికుల బ్యాగుల్లో ఇతర ప్రాంతాలకు తరలిపోతోంది. పోలీసుల తనిఖీలో నెల రోజుల వ్యవధిలో 200 కిలోలకు పైగా గంజాయి నిల్వలు పట్టుబడడం చర్చనీయాంశమవుతోంది. లగేజీ బ్యాగులు కనిపిస్తే చాలు.. అందులో గంజాయి కచ్చితంగా ఉంటుందనే నమ్మకం పోలీసుల్లో ఏర్పడింది.

ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. పోలీసులు తనిఖీలు ముమ్మరం చేయడంతో అధికంగా గంజాయి రవాణాదారులు పట్టుబడుతున్నారు. పట్టుబడిన వారంతా కేవలం రోజువారి కూలీలు, మధ్యవర్తులే. గంజాయిని పండించే వారు కానీ, విక్రయదారులు కానీ పోలీసులకు పట్టుబడకపోవడం గమనార్హం.

తాజాగా వారం రోజుల వ్యవధిలో ఇచ్ఛాపురం, మందస, కాశీబుగ్గ పోలీసులు పలాస రైల్వే పోలీసులు సాధారణ తనిఖీలు చేస్తున్నారు. ఈ క్రమంలో వివిధ మారాల ద్వారా రవాణా చేస్తున్న గంజాయి పట్టుబడుతూనే ఉన్నాయి. గంజాయి తరలింపులో ఎక్కువగా యువత ఉండడం విశేషం. ఇటీవల గంజాయి ముఠా ఇచ్ఛాపురం పోలీసులకు పట్టుబడింది.

ప్రజాశక్తి- పలాస

ఒడిశా రాష్ట్రం బరంపురం నుంచి ఇచ్ఛాపురం మీదుగా రైలులో గంజాయిని పూణే తరలించేందుకు ముగ్గురు ముఠా సభ్యులు సిద్ధమయ్యారు. వారి దగర మామూళ్లు తీసుకుని.. వారికి ఇద్దరు రైల్వే కానిస్టేబుళ్ల సహకరించారన్న ఆరోపణలు ఉన్నారు. మిగతా పోలీసులు సమాచారం తెలుసుకుని మొత్తం ఐదుగురినీ అరెస్టు చేశారు. బ్యాగుల్లో ఉన్న 72 కేజీల గంజాయి నిల్వలను స్వాధీనం చేసుకున్నారు. ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా రయాగడ బ్లాక్ పర్లాకిమిడికు చెందిన ఉత్తర గౌడో కుషా బుయాన్, రంజు గమాంగో గంజాయి ముఠాను ఈ నెల 7న పటుకున్నారు. సహకరించిన ఆర్‌పిఎఫ్ కానిస్టేబుళ్ల గంజాం జిల్లా, చీకటి బ్లాక్ సువాని గ్రామానికి చెందిన జుదిష్టి, బెహరాలను రిమాండ్‌కు తరలించారు.

గతేడాది పలాస- కాశీబుగ మున్సిపాలిటీ పరిధి లక్ష్మీపురం టోల్ గేటు వద్ద ఒడిశా నుంచి ఆయిల్ ట్యాంకు వస్తుండగా... అనుమానంతో కాశీబుగ పోలీసులు సోదాలు చేశారు. ట్యాంకులో పెట్రోల్‌కు బదులు టన్నున్నరకు పైగా గంజాయి ఉండడంతో నివ్వెరపోయారు.

కొన్నాళ్ల కిందట లక్ష్మీపురం టోలేట్ వద్ద కాశీబుగ్గ పోలీసులు.. ఖాళీగా వెళ్తున్న ఒడిశాకు చెందిన ఒక లగేజీ వ్యాన్‌ను తనిఖీ చేశారు. వ్యాన్ కింద భాగంలో చూడగా.. ప్రత్యేకంగా ఓ అర కనిపించింది. అది తెరిచి చూడగా.. అందులో 200 కిలోలకుపైగా గంజాయి పట్టుబడింది.



ఒక్క ఫిబ్రవరిలోనే...

ఫిబ్రవరి 5న ఒడిషా రాష్ట్రం గంజాం జిల్లాకు చెందిన శంకరన్ మిశ్రా, సరోజ్ కుమార్ సాహు 22 కేజీలు, 7న బీహార్‌కు చెందిన ఆకాష్ కుమార్, ప్రేమజిత్‌కుమార్ 41 కేజీలు, 18న తమిళనాడుకు చెందిన ఎస్.మణికందన్, కలియాధన్ నుంచి 16 కేజీలు, 20న ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా వసంత పచ్చర్య నుంచి 7 కేజీలు, 21న తమిళనాడు రాష్ట్రానికి కె.సంతోష్ ఐదు కేజీలు, 23న ఒడిశా రాష్ట్రం ఆర్.ఉదయగిరి గజపతి జిల్లా ఆసీస్ నాయక్ 17 కేజీల గంజాయిని కాశీబుగ్గ పోలీసులు, పలాస జిఆర్‌పి పోలీసులు వేర్వేరుగా తమ తనిఖీల్లో భాగంగా గంజాయి పట్టుకొని వారిపై కేసులు నమోదు చేశారు.

ఒడిశాలో సాగు

ఆంధ్రా-ఒడిశా హరిహద్దు మల్కన్ గిరి, ఆర్.ఉదయగిరి, మోహన, గజపతి బ్లాకుల్లో ఉన్న మారుమూల కొండలు, అటవీ ప్రాంతాల్లో గంజాయిని విరివిగా పండిస్తున్నారు. గిరిజనులను పావులుగా వినియోగించుకొని.. వారికి ఎకరాకు రూ.లక్ష నుంచి రూ.2లక్షల వరకూ బయానా ఇస్తూ... పండిస్తున్నారు. పంట పండిన తరువాత రైతుల నుంచి మధ్యవర్తులు ఒడిశా బోర్డరు వరకూ తీసుకువచ్చి అక్కడ నుంచి కూలీలు, చిన్నచిన్న మధ్యవర్తులకు అప్పగిస్తారు. నిఘా లేకపోతే రైలు మార్గం, నిఘా ఎక్కువయితే రోడ్డు మార్గం గుండా గంజాయిని హైదరాబాద్, బెంగళూరు, చెన్నయ్, ముంబాయి ప్రాంతాలకు తరలిస్తుంటారు. పది కిలోలకు ఒక్కో కూలీకు రూ.5 వేలు నుంచి వారి చేసిన సాహసం బట్టి రూ.10 వేల వరకూ ఇస్తుంటారు. అయితే తమకు నిజమైన వ్యాపారి ఎవరనేది తెలియదని, కనీసం వారి ఫోన్ నంబర్లు కూడా అందుబాటులో ఉండవని కూలీలు చెబుతున్నారు. కేవలం మధ్యవర్తుల ఫోన్ చేసి ఫలానా వ్యక్తి వేసుకున్న దుస్తుల కలర్, ఎత్తు ఆధారాలు చెప్పి సరుకు ఇవ్వాలని ఆదేశిస్తారు. ఆ ఆనవాళ్ల ప్రకారం గంజాయి నిల్వలు అందజేస్తామని పోలీసు దర్యాప్తులో నిందితులు అంగీకరిస్తుంటారు. ఏదేమైనాప్పటికీ గంజాయి పలాస కేంద్రంగా ఇతర ప్రాంతాలకు ఎగుమతి కావడం పోలీసులకు సవాల్‌గా మారింది.

ముమ్మరంగా తనిఖీలు

ఒడిశా రాష్ట్రంలో సాగు ఉండడంతో పలాస నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు అనుకూల వాతావరణం. ఒక వైపు క్రైం అదుపు చేస్తూ... మరోవైపు గంజాయి ఇతర ప్రాంతాలకు ఎగుమతి కాకుండా ప్రత్యేక బృందాలు పర్యటిన్నాయి. ముమ్మరంగా తనిఖీ చేపడుతున్నాం. గంజాయి, మారకద్రవ్యాలు బారిన పడకుండా యువతకు అవగాహన కల్పిస్తున్నాం. గంజాయి తరలింపులో అమాయకులు బలైపోతున్నారు. నిజమైన యజమానులను గుర్తించి వారిపై చర్యలు తీసుకోవడానికి చర్యలు తీసుకుంటున్నాం.

- విజయ్ ఆనంద్, కాశీబుగ్గ సిఐ

2012లో ఎస్ఐ స్థాయి అధికారి...

2012 అక్టోబరు 3న పలాస ఆర్‌పిఎఫ్ ఎస్ఐ స్థాయి అధికారి సుమారు 200 కిలోలకుపైగా గంజాయి రవాణాకు సిద్ధమవ్వగా, కాశీబుగ్గ పోలీసులు రెడ్‌హ్యాడర్‌గా ఆయనను పట్టుకున్నారు. ఈ కేసులో మరో ఆర్‌పిఎఫ్ కానిస్టేబుల్ పరారీ కాగా... ఆయనను సైతం పట్టుకుని న్యాయస్థానంలో నిలబెట్టారు. ఈ కేసుపై రైల్వే విజిలెన్స్ సిఐ జెన్నా నేతృత్వంలో అప్పట్లో దర్యాప్తు చేసి అక్రమాలకు పాల్పడిన ఎస్ఐ, కానిస్టేబుల్‌ను విధుల నుంచి తాత్కాలికంగా తొలగించారు. పలాస రైల్వేస్టేషన్‌కు ఆనుకుని బ్యారెక్స్ అప్పట్లో ఉండేది. ప్రస్తుతం ఆ ప్రాంతం రైల్వే సిబ్బంది పార్కింగ్ స్థలంగా వినియోగిస్తున్నారు. ఇందులోనే ఎస్ఐ నివాసం ఉంటూ ఎవరికీ అనుమానం రాకుండా ఒకరిద్దరు సిబ్బంది సహకారంతో రైల్వే లైసెన్స్ కూలీల ద్వారా రైలు నుంచి నేరుగా బ్యారెక్స్‌కి గంజాయి తీసుకువచ్చేవాడు. అక్కడ నుంచి కిలోల చొప్పున ప్యాకెట్లు చేసి మళ్లీ తిరిగి రైలులో హైదరాబాద్, బెంగళూరు తరలించేవాడు. ఈ వ్యవహారంపై రైల్వే పోలీసులు నిఘా పెట్టి కాశీబుగ్గ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో బండారం మొత్తం బయట పడింది.



సదస్సులో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

'ఉపాధి'ని నీరుగారుస్తున్న కేంద్రం

- రక్షణ కోసం ఐక్య పోరాటాలకు సిద్ధం
- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వ్యవసాయ కూలీలంతా ఐక్యంగా పోరాడి సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం బిజెపి నీరుగార్చే విధానాలను అమలు చేస్తోందని, ఈ చట్టాన్ని తిరిగి పరిరక్షించుకు నేందుకు ఐక్యంగా పోరాడేందుకు సిద్ధం కావాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. నగరంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో సంఘం 17వ జిల్లా మహాసభ ఆదివారం నిర్వహించారు. ముందుగా సంఘం జెండాను ఆయన ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రజావ్యతి రేక విధానాలు వల్ల పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ గతేడాది కంటే ఈ ఏడాది బడ్జెట్‌లో కోత విధించి కూలీల పొట్టకొట్టిందని విమర్శించారు. సంస్కరణలతో ప్రజల ఉపాధికి గండి కొడుతున్నారన్నారు. ఈ చట్టాన్ని కాపాడుకునేందుకు పోరాటాలే శరణ్యమన్నారు. కేంద్ర ప్రభుత్వం చట్టంలో తీసుకొస్తున్న నూతన విధానాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. 200 రోజులు పని దినాలు కల్పించడంతో పాటు రూ.600 కూలి చెల్లించాలని అన్నారు. ఏడాది కాలంగా దేశవ్యాప్తంగా వ్యక్తమవుతున్న ఆందోళనను కేంద్ర ప్రభుత్వం పెడచెవిన పెట్టిన తీరు దుర్మార్గమని అన్నారు. వామపక్ష పోరాటాల ఫలితంగా యుపిఎ ప్రభుత్వ హయాంలో అమలులోకి వచ్చిన ఉపాధి హామీ చట్టం గొంతు నులమడమే లక్ష్యంగా మోడీ ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. ఉద్యోగ, ఉపాధి రంగం గతంలో ఎన్నడూ లేని విధంగా క్షీణించిందని, దీని ఫలితంగా ఉపాధి హామీ పనులకు డిమాండ్ పెరుగుతోందని అన్నారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరావు సింహాచలం మాట్లాడుతూ సాంకేతికతను అడ్డం పెట్టుకుని పేదల జీవనోపాధిని దెబ్బతీసేందుకు కుట్ర చేశారన్నారు. ఉపాధి హామీని ఆధార్ అనుసంధానం తప్పనిసరి చేయడాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి పెద్దఎత్తున పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. సదస్సులో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు భవిరి కృష్ణమూర్తి, జిల్లా నాయకులు కె.ఎల్లయ్య, జి.ఈశ్వరమ్మ, డి.భాస్కరరావు, పి.భవాని, భానుమతి పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

నగరంలోని జిల్లా యుటిఎఫ్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన 17వ జిల్లా మహాసభల్లో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షునిగా శిర్ల ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా గంగరావు సింహాచలం తిరిగి ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు. వారితో పాటు 15 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు, రాష్ట్ర నాయకులు బి.కృష్ణమూర్తి, జిల్లా నాయకులు గంగరావు ఈశ్వరమ్మ పాల్గొన్నారు.



సిర్ల ప్రసాద్, సింహాచలం

జగనన్న గృహాలతో ఊర్లు వెలిశాయి

శాసనసభ స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి పొందూరు

జగనన్న గృహ నిర్మాణ పథకం ద్వారా పెద్ద ఎత్తున చేపట్టిన ఇళ్ల నిర్మాణాలతో ఊర్లు వెలిశాయని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. పొందూరు మండలంలోని నందివాడ, పొందూరు, ధర్మపురం, తోలాపి గ్రామాల్లో జగనన్న గృహ నిర్మాణ పథకంలో చేపట్టిన ఇళ్లను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి పేదవానికీ సొంతింటి కళను సాకారం చేయాలనేది ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ఆశయమని పేర్కొన్నారు. జగనన్న కాలనీలకు పూర్తిస్థాయిలో విద్యుత్, తాగునీరు, రహదారి సదుపాయాలను కల్పించామని అన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, ఎంపిపి ప్రతినిది కిల్లి నాగేశ్వరరావు, వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, పార్టీ మండల జెసిఎస్ బాడాన వెంకటకృష్ణారావు, వైసిపి వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండారు ప్రతాప్‌కుమార్, ఉప సర్పంచ్ గోవిందరావు పాల్గొన్నారు.



శిలాఫకాన్ని ఆవిష్కరిస్తున్న స్పీకర్ సీతారాం

పోలియో నిర్మూలనే లక్ష్యం

కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఐదేళ్లలోపు చిన్నారులందరికీ తప్పనిసరిగా పల్స్‌పోలియో చుక్కలు వేయించాలని కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. నగరంలోని పాతశ్రీకాకుళం సంతోషి మాత ఆలయం కూడలి వద్ద పల్స్‌పోలియో కార్యక్రమాన్ని కలెక్టర్, ఆయన సతీమణి, నగరపాలక సంస్థ కమిషనర్ తమీమ్ అన్సారియాలు ఆదివారం ప్రారంభించారు. ఈ మేరకు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్యంపై తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని పిలుపునిచ్చారు. పోలియో మహమ్మారి బారిన పడితే జీవితాంతం మానసికంగా ఆవేదన ఉంటుందని, తల్లిదండ్రులు దీనిని గ్రహించాలని సూచించారు. చిన్నారులను చక్కగా పెంచి ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దడం ధ్యేయంగా ఉండాలని పేర్కొన్నారు. తద్వారా ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని, భవిష్యత్ బాగుంటుందని అన్నారు. ఐదేళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలన్నారు. పోలియో లేని రాష్ట్రంగా ఆవిర్భవించాలని, పిల్లల బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి, జిల్లా ఇమ్యూనేజేషన్ అధికారి డాక్టర్ ఎస్.ఈశ్వరిదేవి, జిల్లా మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ, స్వచ్ఛంద సేవకులు మంత్రి వెంకటస్వామి, డాక్టర్ జాన్, హెచ్.ఇ,మోహిని, మహిళా సూపర్‌వైజర్ లక్ష్మి, అంగన్వాడీ వర్కర్ల, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



పోలియో చుక్కలు వేస్తున్న కలెక్టర్, కమిషనర్

ఉపాధి అవకాశాలు కల్పించాలని వినతి

ప్రజాశక్తి- కొత్తూరు

జిల్లాలో గిరిజన ప్రాంతాల్లో ఉన్న గిరిజన నిరుద్యోగులను ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించి ఆదుకోవాలని గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మక అప్పన్న, గిరిజన చైతన్య వేదిక మండల కార్యదర్శి సవర సింహాచలం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టెక్కలి సబ్ కలెక్టర్ నూరల్ కమల్ ఆదివారం గ్రామసభ నిర్వహించారు. ఇందులో భాగంగా సబ్ కలెక్టర్ సచివాలయంలో భూ సమస్యలపై ఫిర్యాదులు స్వీకరణ చేపట్టారు. విషయం తెలుసుకున్న ఆదివాసీ సంఘ నాయకులు సబ్ కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిఒ నంబరు 3ని కొట్టివేయడంతో గిరిజన ప్రాంతాల్లోని ఆదివాసీ నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకుండాపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కారణంగా గిరిజన ప్రాంతాల్లో ఆదివాసీల చదువులు సక్రమంగా కొనసాగడం లేదన్నారు. స్థానిక గిరిజన ప్రాంత భాషలైనా సవర, ఇతర భాషల ఆధారంగా బోధించే ఆదివాసీ ఉపాధ్యాయులను నియమించకపోవడంతో ఆదివాసీలు చదువుకు దూరమవుతున్నారని అన్నారు. డ్రాపౌట్స్ కూడా పెరిగే అవకాశం ఉంటుందన్నారు. జిల్లాలో రాజ్యంగాపరంగా గుర్తించి 5వ షెడ్యూల్డ్‌లో లేని గ్రామాలను షెడ్యూల్డ్‌లో చేర్చాలన్నారు. ఆదివాసీల అటవీ ఉత్పత్తులకు కనీస మద్దతు ధరకు ప్రభుత్వం కొనుగోలు చేయాలన్నారు. గిరిజన ప్రాంతాల్లోని ఉద్యోగ ఖాళీలను ఆదివాసీలతో భర్తీచేయాలన్నారు. మెట్టూరు నుంచి లబ్బ వరకు పక్కా రోడ్డు వేయాలన్నారు. లబ్బ రెవెన్యూ పరిధిలోని కారిగూడ పంచాయితీ బాంద్రగూడ, సీతంపేట మండలం కె.గుమడ పంచాయతీ పరిధిలోని కొత్తగూడ గిరిజనుల రెవెన్యూ భూమిపై భూ రీ సర్వే చేసి సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజనులు సవర రాజు, సవర ఆనప పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న అప్పన్న

సచివాలయ వ్యవస్థతో అభివృద్ధి

పశుసంవర్ధకశాఖ మంత్రి అప్పలరాజు



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి- పలాస

గ్రామాలు అభివృద్ధి చెందాలని, ప్రజలకు గ్రామాల్లోనే అక్కడక్కడే సమస్య పరిష్కారం చేయాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి దేశంలో తలమానికంగా నిలిచాయని పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మండలంలోని అమలకుడియాలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం జగన్ ఒకవైపు రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తూ మరోవైపు సంక్షేమ పథకాలు అందిస్తున్నారని చెప్పారు. వీటిని ప్రతి పక్షాలు జగన్ రాష్ట్రాన్ని నాశినం చేస్తున్నారని అంటున్న ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరించాలన్నారు. వైసిపి ప్రభుత్వంలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కొర్ల శిరీష, కొర్ల మురళీకృష్ణచౌదరి, ఎంపిపి ఉంగ ప్రవీణ, పలాస పిఎసిఎస్ అధ్యక్షులు పైల వెంకటరావు చిట్టి, పలాస ఎంపిపి ప్రతినిధి ఉంగ సాయికృష్ణ, గొండు మోహనరావు, దంతం వైకుంఠరావు పాల్గొన్నారు.

వైసిపితోనే మహిళలకు ప్రాధాన్యం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అమలు కావాలంటే మళ్లీ వైసిపి ప్రభుత్వం రావాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. ఆదివారం మండలంలో లొద్దపుట్టి పంచాయతీలో పర్యటించి మహిళలతో సమావేశం నిర్వహించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. లోద్దపుట్టి పంచాయతీకి వైసిపి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని, లబ్దిదారులు పొందిన పథకాల లబ్దిని మహిళలకు వివరించారు. అనంతరం లోద్దపుట్టిలో శ్రీజానకిమాత స్వయంశక్తి సంఘానికి చెందిన పంది సీతమ్మ, అంబటి బుద్ధమ్మ ఇరువురు ఇటీవల మరణించడంతో 4వ విడత ఆసరా రుణమాఫీ డబ్బులను నామినిగా ఉన్న వారి కుటుంబ సభ్యులకు రూ.11,500 చొప్పున ఆమె అందించారు. కార్యక్రమంలో ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి నారాయణమ్మ, పిట్ట హేమలత, ఆశి మందాకిని, పురుషోత్తం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

'పది' పరీక్షలకు సిద్ధం

- మార్చి 18 నుంచి 30 వరకు పరీక్షలు
- విద్యార్థుల ఉత్తీర్ణతకు ప్రణాళిక
- 145 పరీక్షా కేంద్రాలు, 33 స్ట్రాంగ్ రూమ్‌లు ఏర్పాటు
- 561 పాఠశాలల నుంచి 30,574 మంది హాజరు
- జిల్లా విద్యా శాఖాధికారి కె.వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం చేశామని జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు తెలిపారు. 145 పరీక్షా కేంద్రాలను గుర్తించి పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు దాదాపు పూర్తి చేశామన్నారు. ఈ నెల 18 నుంచి 30 వరకు పరీక్షలు జరగనున్నాయని అన్నారు. పరీక్షలకు ఇప్పటికే తరగతులను పూర్తి చేసిన ఉపాధ్యాయులు రివిజన్ తరగతులపై దృష్టి పెట్టారని అన్నారు. శతశాతం ఉత్తీర్ణత సాధించాలన్నదే ఉపాధ్యాయుల లక్ష్యంగా తర్ఫీదు ఇస్తున్నారని అన్నారు. మెరుగైన ఫలితాలు సాధించడానికి పాఠశాల స్థాయిలో ప్రత్యేక శ్రద్ధ చూపామన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులూ శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖాముఖిలో భాగంగా 'ప్రజాశక్తి'తో మాట్లాడారు.

? ఏర్పాట్లకు తీసుకున్న ప్రణాళికలు ఏమిటి?

జిల్లా వ్యాప్తంగా పది పరీక్షల నిర్వహణకు అవసరమైన అన్ని చర్యలు పూర్తి చేశాం. జిల్లాలో ఈ ఏడాది 145 కేంద్రాలను ఎంపిక చేశాం. ఈ నెల 18 నుంచి పది పరీక్షలు మొదలు కానున్నాయి. ఈ నెల 30 వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి. జిల్లాలో మొత్తం 561 ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల నుంచి 30,574 మంది విద్యార్థులు పది పరీక్షలు రాసేందుకు సన్నద్ధమయ్యారు. వారిలో 28,982 మంది రెగ్యులర్, 1592 మంది ప్రయివేటు విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. 15818 మంది బాలురు, 14756 మంది బాలికలు పరీక్షలు రాయనున్నారు. వారి కోసం 145 పరీక్షా కేంద్రాలను సిద్ధం చేశాం. ఇందులో ఎ-కేటగిరీ కేంద్రాలు 55, బి-కేటగిరీ 28, సి-కేటగిరీ 62 సిద్ధం చేశాం.

? విద్యార్థులు పరీక్షలకు ఎలా సన్నద్ధమవుతున్నారు?

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ పదో తరగతి పరీక్షలు రాయనున్న ప్రతి విద్యార్థీ ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు ప్రణాళికాబద్ధంగా ప్రత్యేక శ్రద్ధతో చదివించి సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే ప్రత్యేక తరగతులను పూర్తి చేశాం. ఇందుకు గాను నిపుణులు తయారు చేసిన మాదిరి ప్రశ్నాపత్రాలను సైతం సాధన చేయించడం, ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. ఎంపిక చేసిన అంశాలపై పట్టు సాధించేలా విద్యార్థులకు తర్ఫీదు ఇస్తున్నాం. విద్యార్థులు శ్రద్ధతో చదివితే మంచి ఫలితాలు సాధ్యమవుతాయి. ఎక్కడా నిర్లక్ష్యానికి తావులేకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. పాఠశాల స్థాయిలో ప్రత్యేక పర్యవేక్షణ ఉంది. అయితే ఇంటి వద్ద తల్లిదండ్రులు ఈ సమయంలో వారిపై కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే ఉత్తమ ఫలితాలు అందుకోవడానికి తోడ్పడుతుంది.

? వెనుకబడ్డ వారిపై ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు?


పాఠశాల స్థాయిలో తరగతుల నిర్వహణలో అత్యంత శ్రద్ధ వహించడం వల్ల వెనకబడ్డ వారిలో పరీక్షలపై శ్రద్ధ పెరిగింది. వారికి ప్రీ ఫైనల్ పరీక్షలతో పాటు పరీక్షలకు అనువైన అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం. తరగతి గదుల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించడం, అదనపు సమయం చదివించడం వంటి చర్యలు చేపట్టాం. ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించి విద్యార్థులపై ఉత్తీర్ణతాశాతాన్ని పెంచడానికి అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. అయితే వారు ఇంటికీ వెళ్లిన తర్వాత అదనంగా మరికొంత సమయం కష్ట పడి చదవాలంటే వారికి అనువైన వాతావరణాన్ని తల్లిదండ్రుల నుంచి ఉండాలి. ప్రధానంగా టివి, మొబైల్ ఇతర ప్రసారాలకు దూరంగా ఉండేటట్లు తగిన జాగ్రత్తలు పాటించాలి. అవసరమైనప్పుడు వారిలో ఒత్తిడిని తగ్గించడానికి మానసిక దృఢత్వం వచ్చే విధంగా ప్రోత్సహిస్తూ మాట్లాడాలి.

? పర్యవేక్షణ ఎలా ఉంది?

పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులపై ఉపాధ్యాయులు పర్యవేక్షిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో జిల్లా విద్యాశాఖాధికారి, సమగ్ర శిక్షా అభియాన్ ఎపిసి, ఉప విద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులు, సీనియర్ ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణ ఉంటుంది. 145 కేంద్రాల్లో చీఫ్ సూపరింటెండెంట్ల నియామకం పూర్తి చేశాం. అలాగే 145 మంది డిపార్ట్‌మెంట్ అధికారులను నియమించాం. 15 మంది అదనపు డిపార్ట్‌మెంట్ అధికారులు, ఏడుగురు ప్లైయింగ్ స్క్వాడ్స్ పర్యవేక్షణ ఉంటుంది. మరో 15 మంది సిట్టింగ్ స్క్వాడ్‌లుగా వ్యవహరిస్తారు. 1350 మంది ఇన్విజిలేటర్లను నియమించాం. పరీక్షా పత్రాలను భద్రపర్చడానికి 33 స్ట్రాంగ్ రూమ్‌లను సిద్ధం చేశాం. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. కేంద్రాల్లో ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని ఇప్పటికే సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేశాం. కేంద్రాల వద్ద తాగునీరు, మరుగుదొడ్ల సదుపాయం వంటి తప్పనిసరిగా ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.



కె.వెంకటేశ్వరరావు, డిఇఒ





మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

మహిళలకు ప్రాధాన్యం

ప్రజాశక్తి - రణస్థలం

వైసిపి ప్రభుత్వం మహిళలకు ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. స్థానిక కళ్యాణ వెంకటేశ్వర వేదిక కళ్యాణ మండపంలో జగనన్నను గెలిపించుకోవడానికి మేము సిద్ధం-మా మహిళలు సిద్ధం' కార్యక్రమాన్ని నాలుగు మండలాల మహిళా టీమ్‌లతో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలను సిఎం జగన్ ప్రవేశపెట్టారని అన్నారు. ఖాతాల్లో డబ్బులు జమ చేస్తూ... మహిళాభివృద్ధికి కృషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల మార్కెట్ కమిటీ ఛైర్మన్ లంకలపల్లి వెంకటరత్నం ప్రసాద్, మహిళా అధ్యక్షులు గురాన మానస, మహంతి విజయలక్ష్మి, గుండ భాగ్యశ్రీ, కంది రమాదేవి పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: వచ్చే ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వం ఓడిపోతే పేద ప్రజలకే నష్టమని ఎంపిపి ప్రతినిధి ఉప్పరపల్లి ఉదయ్ కుమార్ అన్నారు. పెద్దబడాంలో నాయకులు, కార్యకర్తలతో ఎన్నికలకు సంబంధించి సమాయత్త సమావేశం నిర్వహించి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం వచ్చిన తరువాత పేదలకు మేలు జరిగిందన్నారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే పేదలకు ఇప్పుడు అందుతున్న సంక్షేమం ఆగిపోతుందన్నారు. సమావేశంలో వైస్ ఎంపిపి వంక రాజు, మాజీ ఎంపిటిసి ఇరోతు హేమంతరాజు, సర్పంచ్ మోహనరావు, దువ్వాడ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.



సమావేశంలో ఎమ్మెల్సీ రఘువర్మ

ఒపిఎస్ ముద్దు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

రాష్ట్ర ప్రభుత్వం సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్ తీసుకురావాలని ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ డిమాండ్ చేశారు. స్థానిక ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన కొర్ల కృష్ణమూర్తి అభినందన సభ సందర్భంగా ఎపిటిఎఫ్ మండలశాఖ అధ్యక్షులు టి.కామేశ్వరరావు అధ్యక్షతన విద్యా సదస్సును ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిఎఫ్, డిఎ బకాయిలను తక్షణమే చెల్లించాలన్నారు. ఎపిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భానుమూర్తి మాట్లాడుతూ ప్రస్తుత విద్యారంగ పరిస్థితులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు అనే అంశంపై మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి డి.సరస్వతి, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మదన్, అనిల్ కుమార్, ఢిల్లేశ్వరావు, జె.ధర్మారావు, ఆదినారాయణ పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

'సొండి'ల సంక్షేమానికి కృషి

సోంపేట : సొండి కుల సంక్షేమానికి తనవంతు సహకారం అందజేస్తానని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో రూ.5లక్షలు జిల్లా పరిషత్ నిధులతో నూతనంగా నిర్మించనున్న సొండి కుల సంఘ సామాజిక భవన నిర్మాణానికి ఆమె శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపిపి డాక్టర్ నిమ్మన దాసు, మండల వైసిపి అధ్యక్షులు శిలగాన భాస్కరరావు, మండల జెసిఎస్ అధ్యక్షులు బుద్దాన శ్రీకృష్ణ, సర్పంచ్ నగిరి ప్రభావతి, మస్థిల మంజు, ఎంపిటిసి పొడుగు కామేష్, సొండి కుల జిల్లా అధ్యక్షులు షావుకారు దివాకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామస్వామి

వృత్తిదారుల కడుపు కొడుతున్న బిజెపి

లావేరు: కేంద్రంలో బిజెపి పంచె వృత్తుదారుల కడుపు కొడుతోందని రాష్ట్ర విశ్వబ్రహ్మణ సంఘం అధ్యక్షులు చేవూరి రామస్వామి ఆరోపించారు. ఆదివారం వెంకటాపురంలో విలేకరులతో మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం ఎన్నికల్లో ఓట్లుకోసం పిఎం విశ్వకర్మ యోజన పథకం పెట్టి బ్రాహ్మణ సంఘం కడుపు కొడుతోందన్నారు. పంచె వృత్తిదారులు కాకుండా 18 రకాల వృత్తిదారులను అందులో కలిపి దేశవ్యాప్తంగా రూ.13, 500 కోట్లు కేటాయించిందన్నారు. వృత్తిని చేసుకొని బతికే బంగారం, వడ్రంగి, శిల్పం, కంచరంకు ఐదు కార్పొరేషన్లు ఏర్పాటు చెయ్యాలని, 50 ఏళ్లు నిండిన వారికి పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాజ్యాధికారం కల్పించాలని, 6 నుంచి 7 ఎమ్మెల్యే స్థానాలు కేటాయించాలన్నారు. గతంలో సిఎం జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో తమకు ఎమ్మెల్సీ పదవి ఇస్తామని మాటఇచ్చి గాలికి వదేలేశారని మండిపడ్డారు. సమావేశంలో కానూరి నారాయణరావు, జిల్లా అధ్యక్షులు రాయల రాము, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎ.వేణు మాస్టర్, బి.నీరజ, గోడు అరుణ పాల్గొన్నారు

వైద్య శిబిరం ప్రారంభం

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని పాతబస్టాండ్ వద్ద ఉన్న రెడ్‌క్రాస్ మెడిసిన్ బ్యాంకు ప్రాంగణంలో అందిస్తున్న వైద్య సేవలను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్, నగర కార్పొరేషన్ కమిషనర్ తమీమ్ అన్సారియాలు కోరారు. రెడ్‌క్రాస్ ఆధ్వర్యాన నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం వారు ప్రారంభించారు. ముందుగా రెడ్‌క్రాస్ ఫౌండర్ హెన్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. వైద్యులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి సేవాభావంలో వైద్యం అందించడం శుభ పరిణామమన్నారు. అనంతరం వైద్యులు పి.ఎల్.ఎన్.రాజు, ధర్మాన లక్ష్మీనారాయణ, దినేష్‌కాంత్ ఉదయాన, ప్రేమ్ సర్కారీ, ఎస్.చంద్రశేఖర్, పి.రామకృష్ణ, లక్ష్మణమూర్తి, కిరణ్‌కాంత్, బరాటం అరుణ్‌కుమార్ గుప్తా, కెళ్ల చినబాబు, సునీల్‌కుమార్, వెంకట రాజేష్, కె.ప్రసన్నలక్ష్మి, నికితలకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, కార్యదర్శి బి.మల్లేశ్వరరావు, ప్రజా ఆరోగ్య పరిరక్షణ కమిటీ సభ్యులు కళ్యాణ్, పెంకి చైతన్య, బి.సతీష్‌కుమార్, సుజాత, పవన్ పాల్గొన్నారు.

హరిప్రసన్నకు అవార్డు అందజేత

పొందూరు: మండలం తాడివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు పూజారి హరిప్రసన్న జిల్లా రోటరీ క్లబ్ ఒకేషనల్ అవార్డును అందుకున్నారు. ఆదివారం శ్రీకాకుళం పట్టణంలో బృందావన్ పంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ సుబ్బారావు ఈ అవార్డును అందించారు. ఉపాధ్యాయ వృత్తిని నిబద్ధతతో నిర్వర్తించడం, పాఠశాలలో పేద విద్యార్థులకు పలు స్వచ్ఛంద సంస్థల సహకారంతో స్కాలర్ షిప్‌లు, సైకిళ్లను అందజేశారు. స్వగ్రామం లొద్దలపేటలో స్వచ్ఛభారత్ కమిటీ ఏర్పాటు చేసి ప్రజల భాగస్వామ్యంతో పలు సామాజిక సేవాకార్యక్రమాలను చేపట్టడంతో ఆయన సేవలను గుర్తించి ఈ అవార్డును అందించినట్లు రోటరీ క్లబ్ అవార్డ్స్ చైర్మన్ డా.సప్పటి వసంతరావు తెలిపారు. ఈయనకు అవార్డు లభించడం పట్ల హెచ్ఎం బల్ల కంటయ్య, ఉపాధ్యాయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

చిన్నారుల బంగారు జీవితానికి రెండు చుక్కలు



ఆమదాలవలస : చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న స్పీకర్ సీతారాం



నౌపడ : పోలియో చుక్కలు వేస్తున్న వైద్యులు నందిని, పరిమళ



మెళియాపుట్టి : పోలియో చుక్కలను వేస్తున్న వైద్యాధికారిని హేమంత లక్ష్మి



బూర్జ : చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న ఎంపిపి దీప



ఇచ్ఛాపురం : చుక్కలమందు వేస్తున్న జెడ్‌పిటిసి నారాయణమ్మ

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఐదేళ్ల లోపు చిన్నారులకు పల్స్‌పోలియో చుక్కలు వేయించడం ద్వారా వారి జీవితానికి బంగారు బాటలు వేయవచ్చునని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ఆదివారం పురపాలక సంఘంలోని 15వ వార్డు మోణింగి వారి వీధిలో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్‌లో పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐదేళ్లలోపు చిన్నారులందరికీ తప్పనిసరిగా పల్స్‌పోలియో చుక్కలు వేయించాలన్నారు. ఈ అవకాశాన్ని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. హైరిస్క్ ప్రాంతాల్లో ఉన్న చిన్నారులు ఏ ఒక్కరూ మిగిలిపోకుండా వైద్య సిబ్బంది ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. వ్యాక్సిన్ వలన కలిగే ప్రయోజనాలను మాతృమూర్తులకు వివరించాల్సిన బాధ్యత వైద్య ఆరోగ్యశాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, సచివాలయ సిబ్బందిపై ఉందన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డి.సురేష్, ఫార్మసిస్ట్ చింతాడ వరుణ్ పాల్గొన్నారు.

నౌపడ: సంతబొమ్మాళి మండలంలో పల్స్‌పోలియో కార్యక్రమం విజయవంతంగా నిర్వహించామని ఎంపిడిఒ ఉమా సుందరి తెలిపారు. మండలంలో పలు పోలియో చుక్కల కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. నౌపడ పిహెచ్‌సి పరిధి గ్రామాల్లో వైద్యులు పరిమళ, నందిని ఆధ్వర్యంలో పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశాలు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

కవిటి: ఐదేళ్లలోపు చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని దూగానపుట్టుగ సర్పంచ్ భద్రాచలం అన్నారు. పంచాయతీలో పోలియో చుక్కలు వేసే కార్యక్రమం నిర్వహించారు.

మెళియాపుట్టి: మండలంలో ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలను వేశారు. ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు విధిగా వేయించాలని తల్లిదండ్రులకు వైద్యాధికారులు హేమంతలక్ష్మి, గ్రీష్మ సూచించారు. అలాగే ఆర్‌టిసి కాంప్లెక్స్‌ల వద్ద కేంద్రాలను ఏర్పాటు చేశారు.

బూర్జ: బూర్జ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 1285 మందికి, గుత్తావల్లి పిహెచ్‌సి పరిధిలో 1252 మంది చిన్నారులకు పోలియోచుక్కలు వేశారు. ఈ కార్యక్రమానికి ఎంపిపి కె.దీప హాజరయ్యారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ పావని, డాక్టర్ రమ్యశ్రీ, డాక్టర్ రోజా, సూపర్‌వైజర్లు సరోజిని, పద్మ, సిహెచ్‌ఒలు అప్పలస్వామి, మురళి, ఎంఎల్‌హెచ్ పి, ఎఎన్ఎం, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ, మండలం పరిధిలో జరిగిన పల్స్‌పోలియో విజయవంతమైంది. పట్టణ పరిధిలో చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి, మండలంలో ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ ప్రారంభించారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో అర్బన్ హెల్త్ సెంటర్, మున్సిపాలిటీ అధికారులు అధ్వర్యంలో కార్యక్రమం విజయవంతమైంది.

పోలాకి : నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు అత్యావశ్యకమని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండలంలోని మబగాంలో చిన్నారులకు ఆదివారం పోలియో చుక్కలను వేశారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి డాక్టర్ నల్లి రవికుమార్, పోలాకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ శ్రీనాథ్, ఈశ్వరమ్మ, శేఖర్‌బాబు, లక్ష్మి పాల్గొన్నారు.

రణస్థలం: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో చిన్నారులకు ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పోలియో చుక్కల మందును వేశారు. కార్యక్రమంలో జె.ఆర్.పురం సర్పంచ్ రమణ, రావాడ పిహెచ్‌సి వైద్యులు పి.జనార్ధన్ పాల్గొన్నారు.

సంతబొమ్మాళి : మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపిడిఒ జి.ఉమాసుందరి, సర్పంచ్ కళింగపట్నం లక్ష్మి, ఉమిలాడ సచివాలయం వద్ద పిఎసిఎస్ చైర్మన్ కెల్లి జగన్నాయకులు, జగన్నాథపురంలో సర్పంచ్ జోగి రాములమ్మ, నరసాపురంలో సర్పంచ్ దుక్క భూషణరెడ్డి, గోవిందపురంలో సర్పంచ్ రెయ్య రామిరెడ్డి, పాలతలగాంలో సర్పంచ్ నక్కిట్ల అప్పన్న, బోరు భద్రలో సర్పంచ్ బుస్కల లక్ష్మీకాంతం, బోరుభద్ర ప్రాథమిక ఆరోగ్య వద్ద మెడికల్ ఆఫీసర్ పీస అవని, కాపుగోదయ్యవలసలో సర్పంచ్ అంగ లక్ష్మి చిన్నారులకు పోలియో చుక్కలను వేశారు.

పొందూరు: మండలం తాడివలస పిహెచ్‌సి పరిదిలో 2526 మంది చిన్నారులకుగాను 2387 మంది చిన్నారులకు పోలియో చుక్కలను వేసి 95శాతం పూర్తి చేసినట్లు డా.రమేష్‌నాయుడు, నవీన్‌లు తెలిపారు. పొందూరులో సర్పంచ్ రేగడి లక్ష్మి చుక్కల కార్యక్రమాన్ని ప్రారంభించారు.

తాడివలస ఫార్మసిస్టుకు షోకాజ్ నోటీస్...

మండలం తాడివలస పిహెచ్‌సి పరిధిలో పోలీయో వాక్సిన్ పంపిణీలో ఆలసత్వం కావడంపై ఫార్మసిష్ట ఎన్.శేషగిరికి వైద్యాధికారి డా.రమేష్‌నాయుడు షోకాజ్ నోటీసును జారీ చేశారు. పల్స్‌పోలియో కేంద్రాలకు ఉదయం 7గంటలకు చేరాల్సిన వాక్సిన్ 8 గంటల వరకూ చేరలేదు. దీంతో పలుచోట్ల వ్యాక్సిన్ ప్రక్రియ ప్రారంభం కాకపోవడంతో కేంద్రానికి తల్లిదండ్రులు చిన్నారులను తీసుకువచ్చి చాలా సమయం వేచిచూసి వెళ్లిపోయారు. వ్యాక్సిన్ ఆలస్యం కావడంపై సర్పంచ్ లక్ష్మి జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

పలాస: మండల పరిధిలో రెంట్ కోట, వెంకటాపురం పిహెచ్‌సిల పరిధిలో మొత్తం 2,810 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. పలాసలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు సునీల్, మౌనిక, అంజలి, దేవి, బోనేల గోపాల్, సత్యవతి, శ్యామలాదేవి పాల్గొన్నారు.

సోంపేట: సోంపేట, కంచిలి మండలాల్లో నిర్వహించిన పల్స్ పోలియో విజయవంతమైనట్లు రోటరీ క్లబ్ అధ్యక్షులు దుద్ది శ్రీనివాసరావు తెలిపారు. రెండు మండలాల్లో 80 కేంద్రాల్లో నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్‌పి చైర్మన్ పిరియా విజయ పాల్గొని చిన్నారులకు చుక్కల మందు వేశారు. కార్యక్రమంలో కొర్లాం పిహెచ్‌సి వైద్యాధికారి సౌజన్య, ఎఎన్ఎంలు, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపి పతనం ఖాయం

ప్రజాశక్తి- ఆమదాలవలస

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి పతనం ఖాయమని టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ అన్నారు. ఆదివారం టిడిపి కార్యాలయంలో మెట్టక్కివలస, డాబాల వారి వీధి వార్డుల నుంచి సుమారు 80 మంది యువత టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా రవికుమార్ పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం యువతను నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని బలగ, హడ్కో కాలనీ తదితర ప్రాంతాల్లో నివాస ముంటున్న పలువురు కళింగ కోమటి సామాజిక తరగతికి చెందిన కుటుంబాలు ఆదివారం టిడిపిలో చేరారు. వీరికి విశాఖ-ఎ కాలనీలో సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షులు గొండు శంకర్ స్వగృహంలో టిడిపి కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చంద్రబాబును మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు నిరంతరం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో రెడ్డి శంకర్, మాజీ కౌన్సిలర్ అంబటి లక్ష్మీరాజ్యం, ఇప్పిలి తిరుమల, కళ్యాణ్ రామ్ ఫ్యాన్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బుర్రి మధు, దోండపాటి నవీన్ పాల్గొన్నారు.



వన్యప్రాణుల మాస్కులతో చిన్నారులు

వన్యప్రాణులను కాపాడుదాం

నందిగాం: వన్యప్రాణులను కాపాడాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని పెద్ద తామరపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు బాలక శంకరరావు అన్నారు. ఆదివారం ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం సంధర్భంగా ఆయన మాట్లాడారు. అంతరించి పోతున్న వన్యప్రాణులను సంరక్షించుకోవాల్సిన భాద్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. వన్యప్రాణుల నివాసాలుగా ఉన్న అడవులను కాపాడాలని విద్యార్థులకు వివరిస్తూ వన్యప్రాణుల మాస్కులను విద్యార్థులకు ధరింపజేసి జంతువులు, వాటి మనుగడ, వాటి అవసరంపై వివరించారు.

వెంకటాపురం విద్యానగరం కావాలి

లావేరు: వెంకటాపురం విద్యల నగరంగా మారాలని ఎచ్చెర్ల వైసిపి నాయకులు లుకలాపు అప్పలనాయుడు అన్నారు. ఆదివారం వెంకటాపురంలో నూతనంగా ఏర్పాటైన కెడిఎం కాలేజి ఆఫ్ నర్సింగ్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడుతూ విద్యార్థులు వారి తల్లిదండ్రులు నర్సింగ్ కోర్సులపై ప్రత్యేక శ్రద్ధ కనపర్చాలన్నారు. దేశ వ్యాప్తంగా నర్సింగ్ కోర్సులకు మంచి డిమాండ్ ఉందన్నారు. పిఎసిఎస్ అధ్యక్షుడు బురాడ చిన్నారావు మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి తమ సహాయ సహకారాన్ని అందిస్తామన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ నారాయణరావు, సర్పంచ్ బొంతు ఎల్లంనాయుడు, మాజీ సర్పంచ్ సూర్యనారాయణ, సత్తిబాబు, వేణు మాస్టర్, పొట్నూరు మురళీ పాల్గొన్నారు.

చిరు ధాన్యాలతో ఆరోగ్యం

రణస్థలం రూరల్: చిరు ధాన్యాలు వాడడం వలన మెరుగైన ఆరోగ్యం పొందవచ్చని బెజ్జిపురం యూత్ క్లబ్ డైరెక్టర్ ఎం.ప్రసాదరావు అన్నారు. జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంకు (నాబార్డు) సహకారంతో యూత్ క్లబ్ బెజ్జిపురం స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో జె.ఆర్.పురం వెంకటేశ్వర కాలనీలో నిర్వహిస్తున్న చిరు ధాన్యాలతో ఆహార పదార్థాల తయారీ శిక్షణా కేంద్రంలో శిక్షణ పొందుతున్న 30 మంది మళలను విజయనగరం జిల్లా కొత్తవలసలోని ఆరోగ్యమిల్లెట్ ఎఫ్‌పిఒను ముఖ్య కార్యనిర్వహణాధికారి కె.సరస్వతి ఆధ్వర్యంలో ఆదివారం సందర్శించారు. అక్కడ వారు తయారుచేసి విక్రయిస్తున్న చిరు ధాన్యాలపై అవగాహన కల్పించారు. ఆహార దినుసులను, వ్యాపార అనుభవాలను సందర్శకులతో పంచుకున్నారు.

వైసిపితోనే అభివృద్ధి, సంక్షేమం

నందిగాం: సిఎం జగన్మోహన్ రెడ్డి పాలనలోనే సంక్షేమం, అభివృద్ధి పూర్తిస్థాయిలో జరుగుతుందని వైసిపి శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్ అన్నారు. ఆదివారం మండలం నరేంద్రపురం పంచాయతీ పాతినవానిపేటలో సిసిరోడ్డు, కాలువ నిర్మాణానికి ఎంపిపి నడుపూరు శ్రీరామమూర్తితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా తిలక్ మాట్లాడుతూ దేశ చరిత్రలో లబ్ధిదారులకు నేరుగా సంక్షేమ పథకాలు అందజేసి జగన్మోహన్ రెడ్డి చరిత్ర సృష్టించారన్నారు. ప్రతిఒక్కరూ ప్రభుత్వ పథకాలను వినియోగించు కోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి పూడి ఆశారాణి, తిరుపతిరావు, వైసిపి మండల అధ్యక్షులు తమరి పాల్గుణరావు, జెసిఎస్ మండల కన్వీనర్ జడ్యాడ జయరాం, సర్పంచ్‌లు కనితి నారాయణమూర్తి, కవిటి ఎర్రన్న, దట్టి రాజారావు పాల్గొన్నారు.

జీడికి మద్దతు ధర ప్రకటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న విమలక్క

పలాస : జీడి పిక్కలకు రూ.16 వేలు మద్దతు ధర ప్రకటించి రైతు భరోసా కేంద్రాల వద్ద ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని తెలుగు ఉభయ రాష్ట్రాల అరుణోదయ సాంస్కతిక సమాఖ్య అరుణోదయ సాంస్కృతిక సంఘం ఉభయ తెలుగు రాష్ట్రాల గౌరవ అధ్యక్షులు విమలక్క డిమాండ్ చేశారు. స్థానిక శివరామ దీక్షిత ఆశ్రమంలో ఎపి రైతు కూలీ సంఘం జిల్లా కన్వీనర్ కోనేరు గురయ్య అధ్యక్షతన ఆదివారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీడి పప్పు రేటు పెరుగుతుందని, కానీ పిక్కల ధర మాత్రం రోజురోజుకూ దిగజారడం ఆందోళన వ్యక్తం చేశారు. జీడికి మద్దతు ధర ప్రకటించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. జీడి పరిశ్రమల యజమానులకు వదిలేయడం వల్ల వారి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. పంటల జాబితాలో జీడి పంటను చేర్చి ధరను నిర్ణయించకుండా వదిలేయడం రైతులపై పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ఎపి జీడి రైతుల సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్‌కుమార్, సిఐటియు నాయులు ఎం.గణపతి, సంఘం రాష్ట్ర కమిటి కార్యదర్శి కె.వీరాంజనేయులు, బి.రమేష్, నారాయణ మాస్టర్ మాట్లాడారు. ఈ సదస్సులో టి.భాస్కరరావు, కె.ఢిల్లీరావు, కారి పురుషోత్తం పాల్గొన్నారు.

మంత్రి అప్పలరాజు ఓటమే లక్ష్యం

టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష

ప్రజాశక్తి- పలాస

రాష్ట్రంలో వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి, పలాస నియోజకవర్గంలో పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు ఓటమే లక్ష్యంగా పనిచేయాలని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష, జనసేన జిల్లా అధ్యక్షుడు పి.చంద్రమోహన్, జనసేన నాయకులు దానేటి శ్రీధర్ అన్నారు. మండలంలోని పెద్దనీలావతిలో జనసేన, టిడిపి సంయుక్తంగా ఉద్దాన గర్జన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ముందుగా రామకృష్ణాపురంలో జనసేన, టిడిపి జెండాలను ఆవిష్కరించారు. అనంతరం అక్కడి నుంచి మామిడిపల్లి వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన బహిరంగసభలో వారు మాట్లాడుతూ పలాస నియోజకవర్గంలో జనసేన, టిడిపి నాయకులకు ఎవరికి సీటు ఇచ్చిన మంత్రి సీదిరి అప్పలరాజును ఓడించడం ఖాయమన్నారు. పలాసను అభివృద్ధి చేయకపోగా, కొండలు గుట్టలు, వాగులు సైతం ఆక్రమించారని ఆరోపించారు. టిడిపి, జనసేన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే జీడి రైతులకు అండగా ఉంటామని హామీఇచ్చారు. పలాసలో ఆస్పత్రి హబ్‌ను ఏర్పాటు చేసి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తామని చెప్పారు. నాలుగున్నర ఏళ్లలో రైతులకు వంశధార నీరు ఎందుకు ఇవ్వలేకపోయారని ప్రశ్నించారు. అనంతరం టిడిపి, జనసేన పార్టీలో పలువురు చేరారు. వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, జనసేన నాయకులు డాక్టర్ వి.దుర్గారావు, మున్సిపల్ మాజీ చైర్మన్ కోత పూర్ణ చంద్రరావు, జిల్లా కార్యదర్శి పి.విఠల్‌రావు, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు దువ్వాడ హేంబాబు చౌదరి, టిడిపి మండల అధ్యక్షుడు కుత్తుం లక్ష్మణ్ కుమార్, జనసేన నాయకులు సంతోష్ పండా, కిక్కర ఢిల్లీరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శిరీష



షీల్డ్, నగదు అందజేస్తున్న ధనుంజయ కుమార్

రసవత్తరంగా కబడ్డీ పోటీలు


ప్రజాశక్తి- సంత బొమ్మాళి

గొదలాంలో జరిగిన కబడ్డీ పోటీల్లో కొండవూరు జట్టు విజేతగా నిలిచింది. ఈ నెల 1 నుంచి జరుగుతున్న జిల్లా ఆహ్వానిత కబడ్డీ పోటీలు ఘనంగా జరిగాయి. ఈ పోటీల్లో 16 జట్లు పాల్గొన్నాయి. కొండవూరు జట్టు ప్రథమ బహుమతి రూ.15వేలు, షీల్డ్ గెలుచుకుంది. శివరంపురం ద్వితీయ బహుమతి రూ.10 వేలు, బాడపల్లి తృతీయ బహుమతి రూ.7 వేలు, గొదలాం రూ.7 వేలు చతుర్ధ బహుమతులు కైవసం చేసుకున్నారు. జిల్లా పవర్లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు పిలక ధనుంజయ కుమార్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అడ్డి తిరుపతి, అప్పలరాజు, రాము, గ్రామపెద్దలు భాస్కరరావు, రాంబాబు, గోవింద, వెంకటరమణ, ధర్మారావు, రిఫరీలుగా గవరయ్య, శివాజీ, లచయ్య, వెంకటరమణ, నారాయణ పాల్గొన్నారు.


పొందూరు: మండలం కింతలిలో సీతారామ కళ్యాణ మహోత్సవం సందర్భంగా మూడు రోజులుగా నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో విజేతగా సింగుపురం జట్టు నిలిచింది. ఈ పోటీల్లో రన్నర్‌గా పాలకొండ జట్టు నిలిచింది. విజేతలకు సర్పంచ్ పైడి రాంప్రసాద్, ఎంపిటిసి కూటికుప్పల హనుమంతురావు బహుమతులు అందించారు. కార్యక్రమంలో సింగూరు ఠాకూర్, దుంపల సన్యాసిరావు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ ట్రస్టు ఆర్థికసాయం

కొత్తూరు: మండలం రాయలకు చెందిన దాసరింకి మన్మదరావు పాంక్రియాసిస్, కిడ్నీ, షుగర్ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నాడు. భార్య, ముగ్గురు ఆడ పిల్లలుకాగా అనారోగ్యంతో మన్మధరావు మంచానికే పరిమితం కావడంతో కుటుంబ పోషణ, పిల్లల చదువులకు ఇబ్బంది పడుతున్నారు. పేదరికం కారణంగా రెండేళ్లుగా ఆస్పత్రికి వెళ్లలేని పరిస్థితిలో భగత్ సింగ్ చారిటబుల్ ట్రస్ట్‌ను సంప్రదించగా ఆదివారం రాయలలో మన్మధరావు ఇంటికి వెళ్లి రూ.15 వేలు చెక్కును ట్రస్ట్ సభ్యులు అందించారు. ట్రస్ట్ తరపున ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామన్నారు. అలాగే మదనాపురంకు చెందిన జన్ని భానుప్రియ తల్లిదండ్రులు కొన్నేళ్ల క్రితం మృతి చెందారు. అప్పటి నుంచి భానుప్రియ బాగోగులు పెద్దమ్మ సీమమ్మ చూసుకునేది. ఇటీవల పెద్దమ్మ కుడా మృతి చెందగా, భానుప్రియ ఒంటరిగా మిగిలిపోయింది. బియ్యం, నిత్యావసర సరుకులకు ఇబ్బంది పడడంతో భానుప్రియ సమస్యను ట్రస్టు దృష్టికి తీసుకు వెళ్లగా గ్రామానికి వెళ్లి 50 కేజీల బియ్యం, రెండు నెలలకు సరిపడ నిత్యావసర సరుకుల అందించారు. ట్రస్టు సభ్యులు పొగిరి వినోద్, హరిబాబు, సంతోష్ పాత్రో పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న ట్రస్టు సభ్యులు



మాట్లాడుతున్న సూర్యనారాయణ

మత్స్యకారులను ఎస్‌టిల్లో చేర్చాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో మాదిరిగా మత్స్యకారులను ఎస్‌టి జాబితాలో చేర్చాలని మత్స్యకార ఎస్‌టి సాధన సమితి గౌరవ అధ్యక్షులు చింతపల్లి సూర్యనారాయణ డిమాండ్ చేశారు. నగరంలోని ఎన్‌జిఒ హోమ్‌లో మత్స్యకార ఎస్‌టి సాధన సమితి ఆధ్వర్యాన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. దేశంలో దాదాపు 28 రాష్ట్రాల్లోని మత్స్యకారులు ఎస్‌టి జాబితాలో ఉన్నారని, ఒక్క ఆంధ్రాలో మాత్రమే బిసి జాబితాలో ఉన్నారని అన్నారు. మత్స్యకారులను వైసిపి, టిడిపి విస్మరించాయని విమర్శించారు. తాము రాజ్యాధికారం సాధిస్తే తమ సామాజిక తరగతి సమస్యలు పరిష్కారమవుతాయని, అందుకు మత్స్యకారులంతా ఐకమత్యంగా ఉంటూ పోరాటాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. టిడిపి మత్స్యకారులకు ఒక్క ఎమ్మెల్యే సీటు కూడా ఇవ్వకపోవడం బాధాకరమన్నారు.మత్స్యకార ఎస్‌టి సాధన సమితి కో-కన్వీనర్ ఇద్ది పాపయ్య మాస్టారు మాట్లాడుతూ వేటకు వెళ్లి మృతి చెందిన మత్స్యకారులకు రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎంపీ రామ్మోహన్‌నాయుడు పదేళ్లలో పార్లమెంట్‌లో ఒక్కసారీ మత్స్యకారుల సమస్యలపై మాట్లాడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్‌టి సాధన సమితి కో-కన్వీనర్ మైలపల్లి పోలీసు, ఉపాధ్యక్షులు గుండాల గణేష్‌కుమార్, కొండా సింహాచలం, కోరాడ రాంబాబు, కార్యదర్శి కొర్లయ్య, రమణ, రాంబాబు, రమణ పాల్గొన్నారు.



చికిత్స పొందుతున్న కానిస్టేబుళ్లు

ముగ్గురు పోలీసులకు గాయాలు

ప్రజాశక్తి- పలాస

మండలంలోని నెమలి నారాయణపురం జాతీయ రహదారిపై ఆదివారం వేకువజామున కంటైనర్ ఢీ కొట్టిన ఘటనలో ముగ్గురు పోలీసులకు తీవ్ర గాయాలయ్యాయి. ఎస్‌యుబి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నెమలి నారాయణ పురం జాతీయ రహదారిపై గంజాయి అక్రమ రవాణా సమాచారంతో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో పోలీసులు తనిఖీలు చేపడుతున్నారు. అందులో భాగంగా ఇచ్ఛాపురం నుంచి టెక్కలి వైపు వెళ్తున్న కంటైనర్‌ను ఎస్‌యుబి పోలీసులు ఆపాలని సిగ్నల్ ఇచ్చారు. కంటైనర్ డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా అతివేగంతో ఎస్‌యుబి ఎస్ఐ ప్రభాకర్, కానిస్టేబుల్ పూర్ణ, సురేష్‌లకు బలంగా ఢీకొట్టాడు. దీంతో ముగ్గురూ గాయపడ్డాడు. వెంటనే క్షతగాత్రులను తోటి పోలీసులు పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం జిల్లా సర్వజనాస్పత్రిరి రిఫర్ చేశారు. కాశీబుగ్గ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



చీడివలసలో తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్ఐ సత్యనారాయణ

చీడివలసలో కార్డాన్ సెర్చ్

ప్రజాశక్తి- పోలాకి

మండలం చీడివలసలో జిల్లా ఎస్‌పి ఆదేశాల మేరకు సిఐ ఆధ్వర్యంలో ఆదివారం కార్డాన్ సెర్చ్ నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక ఎస్ఐ వి.సత్యనారాయణ, సారవకోట ఎస్ఐ అప్పారావుతో పాటు సుమారు 40 మంది పోలీసులు పాల్గొని ఇంటింటికి వెళ్లి తనిఖీలు నిర్వహించారు. ఆధార్ కార్డు, ఇంట్లో ఎంత మంది సభ్యులు ఉన్నారు, ఎవరైనా కొత్తవారు ఉన్నారా తదితర అంశాలపై ఆరా తీశారు. అలాగే ద్విచక్ర వాహనాలు, ఫోర్ వీలర్స్ తనిఖీలు చేశారు. సరైన పత్రాలు లేని ఐదు వాహనాలను గుర్తించి స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి- టెక్కలి

సమాజంలో చదువుతో పాటు విద్యార్థులు సామాజిక చింతన వైపు దృష్టిసారించాలని న్యాయవాది చంద్రశేఖర పట్నాయక్ అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో చిన్న నారాయణపురంలో నిర్వహిస్తున్న జాతీయ సేవా పథకం శిబిరాలను ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు విధులు, బాధ్యతలపై తెలుసుకోవాలన్నారు. మహిళలకు చట్టాలపై అవగాహన ఉండాలన్నారు. పిఒ కందిగొల్ల ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లబ్బలో గ్రామసభ

ప్రజాశక్తి- కొత్తూరు

మండలం లబ్బ.గ్రామంలో ఆదివారం రీసర్వే గ్రామసభ నిర్వహించారు. గ్రామ రెవిన్యూ పరిధిలో భూసేర్వేలో తప్పులు దొర్లాయని రైతులు ఫిర్యాదులు చేయడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రీసర్వే గ్రామసభ వెరిఫికేషన్‌కు టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ గ్రామసభలో పాల్గొన్నారు. రైతుల నుంచి భూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గతంలో భూసర్వే తరువాత గ్రామసభ నిర్వహించారు. రైతుల నుంచి వినతులు వెల్లడంతో రెండోసారి గ్రామసభ నిర్వహించారు. 4 నుంచి క్షేత్రస్థాయిలో రీసర్వే చేయాలని సబ్‌కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.వి.ప్రసాద్, ఆర్ఎస్‌డిటి ఆనంతకుమార్, విఆర్ఒ హరహరరావు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి- కవిటి

కవిటి బెహరా వీధిలో పున:నిర్మిస్తున్న జగన్నాథ స్వామి దేవాలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త వైశ్యరాజు శ్రీనివాసరావు రూ.1,00,016లు విరాళంగా అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎంతో ప్రసిద్ధి కలిగిన ఆలయ నిర్మాణానికి దాతల సహకారం అవసరమన్నారు. కార్యక్రమంలో గిరి బెహరా, ఖగపతి బెహరా, తిరుపతి బెహరా, గౌతమ్ బెహరా, సింహాచలం బెహరా, గ్రామస్తులు పాల్గొన్నారు.



పింఛన్ అందుకుంటున్న కన్నయ్య

ఆస్పత్రిలో పింఛను అందజేత

ప్రజాశక్తి- జి.సిగడాం

మండల కేంద్రానికి చెందిన దువ్వు కన్నయ్య ఇటీవల అనారోగ్యంతో రాజాం కేర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆదివారం డిజిటల్ అసిస్టెంట్ పి.రాము, వాలంటీర్ రాంబాబు ఆస్పత్రికి వెళ్లి కన్నయ్యకు పింఛన్ అందజేసినారు. విషయం తెలుసుకున్న ఎంపిడిఒ వెంకన్నబాబు, వైసిపి నాయకులు, కార్యదర్శి సాహు అభినందించారు.

మానవత్వం చాటుకున్న ఎస్ఐ

ప్రజాశక్తి - పాలకొండ



ఆహారం అందజేస్తున్న ఎస్ఐ

స్థానిక ఎస్ఐ ప్రశాంత్‌కుమార్ అనాథ అయిన ఓ వృద్ధురాలికి సాయం అందజేసి తన మానవత్వాన్ని చాటుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఇంటర్ పరీక్షా కేంద్రమైన సాహితీ కాలేజీకి బందోబస్తులు నిమిత్తం ఇటీవల ఎస్ఐ ప్రశాంతకుమార్ వెళ్లారు. ఆ కాలేజీ ఆవరణలో గల వడం చెరువు గట్టుపై ఓ పాకలో అనాధగా ఉన్న ఓ వృద్ధురాలిని చూశారు. ఆమె వద్దకు వెళ్లి కష్టసుఖాలు అడిగి తెలుసుకున్నారు. ఆమె కష్టాన్ని తెలుసుకొని చెల్లించిపోయిన ఆయన ఆమెకు తినుబండారాలు, ఛార్జింగ్ లైట్ ఇచ్చి తన దాతృత్వాన్ని చాటుకున్నారు.

అంటికొండలో గ్రామదర్శిని

ప్రజాశక్తి - సీతంపేట

మన్య ప్రగతి ఆధ్వర్యంలో ప్రజా సమస్యలు, సంస్కృతి - సంప్రదాయాలు, గ్రామాల అభివద్ధి - మానవ సంబంధాలు పై 'గ్రామ దర్శిని - ప్రజా చైతన్య అవగాహనా కార్యక్రమం' మండలంలోని అంటి కొండలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మన్య ప్రగతి చైర్మన్ గేదె రవి మాట్లాడుతూ గ్రామాలు బాగుంటేనే దేశం బాగుంటుంది - మహాత్మా గాంధీ స్ఫూర్తితో యువత ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. అంటికొండలో కుల పెద్దలు, గ్రామ ప్రజలతో కలిసి సంస్కృతి, సంప్రదాయాలు రాబోయే తరాలకు అందించడం, గిరిజన సమస్యలు గురించి చర్చించి ఉన్నత అధికారుల వద్దకు తీసుకుని పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మన్య ప్రగతి అధ్యక్షులు గేదెల జనార్ధన రావు, జనరల్ సెక్రటరీ మీనక ఉమా మహేశ్వరావు, టీం సభ్యులు పాలక సాంబయ్య తదితరులు మాట్లాడారు.

భవన నిర్మాణ కార్మికుల మద్దతు కావాలి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించడానికి భవిష్యత్తులో వైసిపికి మద్దతు ఇవ్వాల్సిందిగా ఎమ్మెల్యే అలజంగి జోగారావు కోరారు. బెలగాం ప్రాంతానికి చెందిన భవన నిర్మాణ కార్యకర్తలు, మేస్త్రీలంతా కలిసి ఆదివారం మర్యాద పూర్వకంగా కలుసుకొని వారి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడం జరిగింది. గతంలో ఇసుక విషయంపై చేసిన ధర్నాలో భాగంగా తమలో కొంతమందిపై కేసులు నమోదయ్యాయని, వీటిని ఉపసంహరించేలా చర్యలు తీసుకోవాలని కోరగా, తక్షణమే స్పందించడమే బదులిచ్చారు. అలాగే భవనిర్మాణ కార్మికుల సంఘానికి ఒక స్థలం కావాలని కోరగా తప్పక చూడడం జరుగుతుందని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. సమావేశంలో వైసిపి సీనియర్ నాయకులు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.గురురాజు, నాయకులు పైడాన అప్పారావు, మజ్జి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వైసిపిలో పలువురు చేరిక



వైసిపిలో చేరిన వారితో స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- ఆమదాలవలస

పురపాలక సంఘ పరిధిలో 2వ వార్డు కృష్ణాపురంకు చెందిన ఏడు కుటుంబాలు స్పీకర్ తమ్మినేని సీతారాం సమక్షంలో వైసిపిలో చేరారు. ఆదివారం కృష్ణాపురంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వార్డుకు చెందిన రోణంకి రాజు ఆధ్వర్యంలో మరో ఆరు కుటుంబాలు చేరాయి. స్పీకర్ సీతారాం వారికి పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ పార్టీ విధివిధానాలు నచ్చి వైసిపిలో చేరుతున్నానని తెలిపారు. ఈ సందర్భంగా స్పీకర్ తమ్మినేని సీతారాం మాట్లాడుతూ సంక్షేమ పథకాల వరవడి కొనసాగాలంటే మళ్లీ జగన్‌నే సిఎంగా గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు తమ్మినేని చిరంజీవి నాగ్, బొడ్డేపల్లి రమేష్ కుమార్, అల్లం శెట్టి ఉమామహేశ్వరరావు, దుంపల శ్యామలరావు, సంపదరావు రామారావు, బొడ్డేపల్లి రాజు, కోన రామకృష్ణ పాల్గొన్నారు.

పలాస: కాశీబుగ్గ సూదికొండ కాలనీకు చెందిన యువకులు రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు సమక్షంలో వైసిపిలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సిఎం జగన్మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు, మంత్రి అప్పలరాజు ప్రజలకు చేస్తున్న మంచిని చూసి వైసిపిలో చేరామన్నారు. జిల్లా కార్యదర్శి బడగల బల్లయ్య, కౌన్సిలర్, పట్టణ అధికార ప్రతినిధులు శిష్టి గోపి, గుజ్జు జోగారావు పాల్గొన్నారు.

జగన్ పాలనలో దళిత, గిరిజనులకు రక్షణ లేదు

ప్రజాశక్తి- టెక్కలి

సిఎం జగన్మోహన్ రెడ్డి పాలనలో దళిత, గిరిజనులపై దాడులు, మారణ హోమాలు, అక్రమ అరెస్టులతో రక్షణ లేకుండా పోయిందని బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా శాఖ అధ్యక్షులు బోకర నారాయణరావు ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల మాచర్ల నియోజకవర్గం రెంటచింతల మండలం మల్లవరంలో ఆదివాసీ గిరిజన తెగకు చెందిన బాణావత్ సామిని అనే గిరిజన మహిళ మంచినీరు అడిగితే ట్రాక్టర్‌తో గుద్ది చంపేశారన్నారు. తిరుమల ట్రాఫిక్ డిఎస్‌పిగా విధులు నిర్వహిస్తున్న కొండప్ప టాక్సీ డ్రైవర్లు, ఆటో డ్రైవర్లు వద్ద నుంచి లంచాల రూపంలో కలెక్షన్ చేయాలని దళిత ట్రాఫిక్ కానిస్టేబుల్ లక్ష్మీనారాయణను ఆదేశించగా లక్ష్మీనారాయణ అంగీకరించకపోవడంతో కులం పేరుతో దూషించి, భౌతిక దాడులు చేయడంతో అనారోగ్యంతో చావు బ్రతుకుల మధ్య నారాయణాద్రి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని నారాయణరావు తెలిపారు. రెండు సంఘటనలకు సంబంధించి ట్రాక్టర్ డ్రైవర్, తిరుమల ట్రాఫిక్ డిఎస్‌పి కొండప్పపై కఠిన చర్యలు తీసుకోవాలని నారాయణరావు డిమాండ్ చేశారు.

శిష్టకరణాల భవనంలో రాజకీయ విందు

శ్రీకాకుళం అర్బన్: శిష్ట కరణాలకు ఓబిసిలో చేర్చడానికి తామే సహకరిస్తున్నామని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు చెపితే... ఢిల్లీలో కమిషన్ ముందుకు, ప్రధాన మంత్రి మోడీ దగ్గరకు ఎవరు తీసుకెళ్లి ఓబిసిని సాధించడానికి అనువైన పరిస్థితి కల్పించారో ఆ సామాజిక నాయకులకు తెలుసని ఎంపీ రామ్మోహన్ నాయుడు అన్నారు. నగరంలోని మహాలక్ష్మి నగర్‌లో నిర్మించిన శిష్టకరణ సామాజిక భవనం ప్రారంబోత్సవం సందర్భంగా ఆదివారం రాజకీయ నాయకులకు విందు ఏర్పాటు చేశారు. శిష్టకరణ సామాజిక తరగతి అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, ఓబిసి రాబోతోందని రెవెన్యూ మంత్రి ప్రసాదరావు, ఎంపీ వేర్వేరుగా చెప్పుకొచ్చారు. కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, శిష్టకరణ సంఘ రాష్ట్ర అధ్యక్షులు పోలుమహంతి ఉమామహేశ్వరరావు, ఎం.వి.పద్మావతి, బలివాడ దయానిధి జగన్మోహనరావు, లోచర్ల రమేష్, డబ్బీరు వాసు, సదాశివుని కృష్ణ, బలివాడ మల్లేశ్వరరావు, విశ్రాంత మెజిస్ట్రేట్ ఎస్.ప్రభాకరరావు పాల్గొన్నారు.

ఓటే వజ్రాయుధం

ప్రజాశక్తి- పొందూరు

ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువైనదని టిడిపి మండల అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహన్ అన్నారు. మండలంలో నూతనంగా ఓటుహక్కు పొందిన వారికి ఆదివారం ఓటుహక్కు ప్రాధ్యానతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ భావితరాల భవిష్యత్ యువత చేతిలోనే ఆధారపడి ఉందన్నారు. 18 ఏళ్లు నిండిన వారు ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో



మాట్లాడుతున్న టిడిపి నాయకులు

మాజీ ఎఎంసి చైర్మన్ అన్నెపు రాము, మండలపార్టీ ప్రధాన కార్యదర్శి వండాన మురళీ, తెలుగుయువత జిల్లా ప్రధాన కార్యదర్శి బలగ శంకర భాస్కరరావు, శ్రీనివాసరావు, బాడాన హరికృష్ణ పాల్గొన్నారు.

రామరత్నంకు సన్మానం



సన్మానిస్తున్న డ్రైవర్లు

శ్రీకాకుళం అర్బన్: అంకితం భావంతో విధులు నిర్వహించి డ్రైవర్ పోస్టుకే రామరత్నం వన్నెతెచ్చారని ఆంధ్రప్రదేశ్ వాహన డ్రైవర్ల సంఘం నేతలు కొనియాడారు. ఆదివారం డ్రైవర్ల సంఘం అతిథి గృహంలోని సమావేశ మందిరంలో సమాచారశాఖ ఉద్యోగి రామరత్నం ఉద్యోగ విరమణ వీడ్కోలు సభ ఆదివారం నిర్వహించారు. 35 ఏళ్ల పాటు సమాచార శాఖలో డ్రైవర్‌గా సేవలందించారని, తన విధి నిర్వహణలో ఒక్క రోడ్డు ప్రమాదానికి తావీయకుండా క్రమశిక్షణగా బాధ్యతను నిర్వర్తించారని అన్నారు. కార్యక్రమంలో డ్రైవర్ల సంఘం నాయకులు సూర్యనారాయణ, పాపారావు, జిల్లా అధ్యక్షులు కె.రమణమూర్తి, ట్రెజరర్ ఐ.శ్రీనివాసరావు, సెక్రెటరీ పి.నాగేశ్వరరావు, కలెక్టర్ డ్రైవర్ వెంకటరావు, ఆర్‌డిఒ డ్రైవర్ ప్రకాష్, తహశీల్దార్ డ్రైవర్ సాహు, శ్యామ్, శాస్త్రి పాల్గొన్నారు.



పుస్తకాలను ప్రదర్శిస్తున్న గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు

గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన

ప్రజాశక్తి- లావేరు

స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం పుస్తక ప్రదర్శన, చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి నెల మొదటి శనివారం మనము, మన గ్రంథాలయం, ప్రతి నెల మొదటి ఆదివారం పుస్తక ప్రదర్శన, ప్రతి నెల ప్రతి ఆదివారం చదవడం మాకిష్టం, ప్రతి నెల మూడవ శనివారం చిల్డ్రన్స్ క్లబ్ నిర్వహిస్తామన్నారు. ప్రతి విద్యార్థి గ్రంథాలయానికి వచ్చి ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు.

మహిళా దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

పలాస: మార్చి 8 అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినం సందర్భంగా మార్చి 1 నుంచి 15 వరకు దేశంలో రాజ్యాంగ హక్కులను హరిస్తున్న బిజెపి, మిత్రపక్షాలకు వ్యతిరేకంగా పోరాడాలని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు బదకల ఈశ్వరమ్మ పిలుపునిచ్చారు. ఆదివారం సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడుతూ బిజెపి రాజ్యాంగపు సంస్థలన్ని నిర్వీర్యం చేస్తుందన్నారు. ప్రశ్నించే వారిపై దాడులు, రాజకీయ కుట్రతో ప్రజాస్వామ్యం గొంతు నులుముతుందన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు కూడా అగ్రవర్ణ మహిళలకు ఉపయోగపడే విధంగా తీసుకువచ్చారు తప్ప శ్రామిక వర్గ మహిళలకు చేసిందేమీ లేదన్నారు. అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినం పోరాట స్ఫూర్తితో జరపాలని పిలుపునిచ్చారు. ఆమెతో పాటుగా జిల్లా కార్యవర్గ సభ్యురాలు సుహాసిని, టి. సరస్వతి, మంగమ్మ, రమణమ్మ పాల్గొన్నారు.



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ వెంకటేష్

ఆత్మస్థైర్యంతో ముందుకు వెళ్లాలి

ఆమదాలవలస : పట్టణంలో వివిధ కళాశాలలు, పాఠశాలలు, వసతిగృహాల్లో ఉన్న విద్యార్థులు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలని ఎస్ఐ వెంకటేష్ అన్నారు. ఆదివారం జిల్లా ఎస్‌పి జి.ఆర్.రాధిక ఆదేశాల మేరకు మెట్టక్కివలస ప్రాంతంలో ఎస్‌సి, బిసి వసతి గృహాలతో పాటు స్థానిక జూనియర్ కళాశాల సమీపంలో ఉన్న వసతి గృహాల్లో చిన్నారికి చేదోడు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల్లో ఆత్మస్థైర్యంతో ముందుకెళ్ళినప్పుడే ఎటువంటి సమస్యలు దరి చేరవన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు కె.సంజీవరావు, కె.వి.రాజారావు పాల్గొన్నారు.

అరసవల్లి సందర్శన

శ్రీకాకుళం అర్బన్ : అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయాన్ని రాష్ట్ర అర్బన్ రీసర్వే స్పెషల్ ఆఫీసర్ బి.సుబ్బారావు సతీసమేతంగా ఆదివారం సందర్శించారు. వారికి ఆలయ మర్యాదలతో అర్చకులు స్వాగతించారు. ఆలయంలో స్వామివారి సేవల అనంతరం అనివేటి మండపంలో వారికి స్వామివారి శేష వస్త్రాలను కప్పి చిత్రపటాన్ని ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ, సీనియర్ అసిస్టెంట్ కృష్ణమాచార్యులు అందజేశారు. మాఘమాసం ఆదివారం కావడంతో సందర్శకుల తాకిడి పెరిగింది. దీంతో ఒక్కరోజు రూ.11.35 లక్షల ఆదాయం సమకూరింది. టిక్కెట్ల రూపేనా రూ.6,50,600, విరాళాల రూపంలో రూ.1,59,567, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.3,25,000 ఆదాయం సమకూరినట్టు ఆలయ ఇఒ డి.ఎల్.వి.రమేష్‌బాబు తెలిపారు.